# మబ్బు తెరలు

మాధవి చంటాడికి కళ్ళనిండా కాటుకపెట్టి ముద్దులు కురుపించి మురిసిపోతోంది. ఆ పదిరోజుల పాపమీద వందేళ్ళ భవిష్యత్తు ఊహిస్తూ ప్రాకే పాపాయిని నడిపించి బడికిపంపి ఆటల్లో చెల్లాయిని తోడిచ్చి ... ఇంకా యింకా ఆకుర్రాడినే పెద్దచేసి పెళ్ళిచేసి ఏవేవో ఆలోచిస్తూ లోలోనే నవ్వేస్తూ, మాటిమాటికి చంటాడిని ముద్దెట్టూ పాలబుగ్గ ఎర్రబడితే 'అమ్మో' అని హృదయానికి హత్తుకుంది.

మధ్యాహ్నం నిద్రమత్తు పూర్తిగా ఒదిలేలా దొడ్లో బావిదగ్గర ముఖంకడిగి తుడుచుకుంటూ యింట్లో ప్రవేశించిన కాంతారావు మాధవిని చూసి గుమ్మందగ్గరే ఆగిపోయి చప్పుడుచెయ్యకుండా వెళ్ళి ఆమెప్రక్కనే కూర్చున్నాడు. మాధవి గతుక్కుమంది. జారిపోయిన పవిటను సరిచేసుకొని పాలు పడదామనుకుంటున్న ఒడిలోచంటాడిని భుజాలమీదకు తీసుకొంది.

"కుర్రాడిని చూసి అలా నీలోనువ్వే నవ్వుకోకపోతే కాస్త నాకుకూడ చెప్పకూడదా?" అన్నాడు కాంతారావు. మాధవికి సిగ్గేసి బుర్రదించుకొంది. చూపుడువ్రేలితో చుబుకాన్ని పైకెత్తి "మనచిన్నాడిని కలక్టరును చేస్తున్నావా, డాక్టరుచేస్తున్నావా?" అన్నాడు ఆమెముఖంలోకి ముఖంపెట్టి మెల్లిగా నవ్వుతూ. నవ్వి ఊరుకుంది మాధవి. "మీలా లాయరు మాత్రంకాడుటే" అని అందాం అనుకుంది. ఆమాట నాలిక చివరవరకూ వచ్చిందిగాని బైటపడలేదు.

'వారిని చూస్తుంటే తనకేదో భయం. వారిఎదురుగుండా ఒక్క మాటకూడా చెప్పలేదు తను. పెళ్ళయి సంవత్సరం పైబడినా అంతచనువుతో వారిముందెప్పుడూ ప్రవర్తించలేదు. ఏమిటో! వారుమాత్రం ఎప్పుడూ ప్రేమతో ఆప్యాయంగా తనను వారివైపు లాక్కుంటారు. కవ్వించి నవ్విస్తారు. తను భయంగా, బిడియంగా పళ్ళుబిగించి మాట్లాడకుండా మరో వైపు చూడబోతే ముఖం వారివైపు త్రిప్పుకొని ముద్దెడతారు. అయినా వారంటే భయం భయంగా అక్కడనుండి తుర్రుమని ఏవంటింట్లోకో పోవాలనిపిస్తుంది తనకు.'

"అదిగో అప్పుడే మళ్ళీఏదో లోకంలోకి వెళ్ళిపోయావ్! ఇలా అయితే నీతో వేగడం కష్టంసుమా."

"బావగారు వేగలేకపోతే మరికొంచెం నూనెపోసుకోండి" తూనీగలావచ్చి తుర్రుమంది మరదలుపిల్ల మాలతి.

"ఇప్పుడేం మాట్లాడకండి. నిద్రపోతున్నాడు" అంటూ లేచి ఉయ్యాల్లో వేసింది మాధవి.

వెనకాలేవచ్చి ప్రక్కనే నుంచున్న కాంతారావు "ఏంపేరు పెట్టాలనుకుంటున్నావు మీ బాబుకి" అన్నాడు.

"మహా మీ బాబుకానట్టు." వెంటనే జవాబిచ్చింది. కాని మళ్ళీ అతనన్న మాటలు జ్ఞాపకంరాగానే సిగ్గిగా కంపించి పోయింది. అది కనబడకుండా తెల్లతెల్లగా నవ్వి వెళ్ళిపోయింది.

మరదలుపిల్ల మళ్ళీవచ్చి "ఏంబావా బాబుకు ఏంపేరు పెడ్తావ్?" అంది. "చెప్పనా... చెప్పనా" అంటూ ఆమె ముందుకొచ్చాడు. తూనీగ పారిపోయి మరో ఐదునిమిషాలకు

మళ్ళీవచ్చి "చెప్పకపోతే దాచుకో ఎవరిక్కావాలి" అంది బుంగమూతిపెట్టి. అందులోనే చిరుకోపం చిన్నగా మెదిలింది.

"ఓయబ్బో! అందుకేగాబోలు అంతఆతృత తెలుసుకోవాలని" "చెప్పు బావా ఏంపేరు పెడ్తావో" స్థాయి తగ్గించి మెట్టు దిగి అంది ఇక బెట్టుసరిచేస్తే లాభంలేదని.

"చెప్పనా?"

"ఊ"

"కృష్ణమోహన్"

"కృష్ణమోహన్ ... కృష్ణమోహన్" – అనుకుంటూ దొడ్లోకి పరుగెత్తింది మాలతి. గదిలో తువ్వాలు ఆరేస్తున్న మాధవి ఆమాటలు వినడంతోనే భర్తవైపు ఓమారుచూసి అతనునవ్వుతూప్రేమతో చిలిపిగా దగ్గరకురమ్మని సైగజేస్తున్నా వెళ్ళకుండా పరధ్యాన్నంగా వరండాలోకి వెళ్ళిపోయింది.

ఆరాత్రిభోజనంచేశాక మాధవి అతని ప్రక్కనే కూర్చొని తాంబూలంచుట్టియిస్తూ "ఆపేరే పెడ్తారా?" అంది.

"ఊ" అన్నాడతను వక్కను పంటిక్రిందపెట్టి కొరకబోయి పెదవి కరుసుకుంటూ.

"నిజంగానా?" అంది రెండుకళ్ళనల్లగుడ్లూ సాధ్యమైనంత పెద్దపరిమాణంలో దగ్గరగాఉంచి. మాటలో ఆతృతని పదంలో ఒణికినచ్చాయల్ని మరుగుపరచలేకపోయింది. అని జవాబేమి వస్తుందో విందామనే ఆతృతతో అతని ముఖంలోకి సూటిగా చూసింది.

"ఏం ... ఆపేరేపెడ్తామనుకొంటున్నాను. బావుంది కదూ.

మనరామం, నేనూకలిసి నువ్వు ఉత్తరం వ్రాసినరోజు సాయ కాలం నాన్నగారితో అరగంటసేపు ఆలోచించి యీ పేర నిర్ణయించాం." అన్నాడు. అని ముందుకువంగి నోరు తె చాడు ఆమె వేరుగా నున్నం వ్రాసిన ఆకు నోటికందిస్తుందని గబుక్కున లేచిపోయి కిటికీముందు నుంచుంది వెనుకభాగ అతనికి అగుపించేలా.

అలా లేచిపోయినందుకు ఆశ్చర్యపోయినా పరిహాసం చేస్తు దేమోనని రెండుసార్లూ మృదువుగా "ఇలారా మాధవీ" అన్నాడు.

ఎప్పుడయినా మాధవి యింట్లో ఎక్కడున్నా, ఏంచేస్తున్నా కాంతారావు అలాస్వరం తగ్గించి లాలనగా పిలుస్తే చప్పున అతని ముందుకొచ్చి 'ఏంపనన్నట్టు' అతని ముఖంలోకి చూసేది. అదేమృదుత్వం అతని మాటల్లో కనుపించినా ఆమెదగ్గరకు రాకపోవడంలో కారణం ఏమిటో తెలీక తనేవచ్చి ఆమె ప్రక్కనే నుంచొని రెండుచేతుల్తోనూ ఆమె భుజాల్ని పట్టి తన వైపుకు త్రిప్పుకున్నాడు.

అప్పుడే జారిపోయిన రెండు కన్నీటి బొట్లకు సూచనగా తడిచారలు ఆమె బుగ్గలమీద కనుపించాయి. "ఏమిటిది మాధవీ!" అని అతను యింకా పూర్తిగా అనకుండానే కంగారుగా పైటకొంగుతో కన్నీటి చారల్ని తుడిచుకొంటూ "ఏంలేదండీ" అంది. అని ఆమె నవ్వాలని, అది అతడ్ని మంత్రముగ్ధుడ్ని చేసి తను ఏడుస్తున్న సంగతి అతను మర్చి పోవాలని నవ్వబోయి ఏడ్పువచ్చి, మధ్యలో నవ్వాపివేసింది.

కాంతారావు కేమిటో అర్థంగాక తిరిగివచ్చి మంచంమీద కూర్చున్నాడు.

పెళ్ళయిన మొదటి రోజుల్లో అలాగే ఆమె చాటుగా అతనికి తెలీకుండా కళ్ళనీళ్లు పెట్టుకొని పొరపాటున అతని కళ్ళ ముందుబడి తప్పించుకుందామని ఒక్కనవ్వు నవ్వేది. ఆనవ్వులో ఆమె చీర సింగారించి, సిగదాపులో జాజిమొగ్గలు తురిమి రంగరించిన బంగారుబొమ్మలా ఎదురుగా నిలచి, ఏదో అతను అంటే అది విని సిగ్గుదొంతర్ల తెరలమధ్య చిన్నగా నవ్విన చ్ఛాయలు కనుపించేవికావు.

'ఏం అలా ఉన్నావ' ని అతను అడగనూలేదు, ఆమె చెప్పనూలేదు. తల్లిదండ్రుల్ని వదిలి ఉండలేని పెండ్లికూతురి తొలిరోజులుకదా అనుకొన్నాడు. తర్వాత అతను ఎప్పుడూ ఆమె కళ్ళవెంట కన్నీరుకారుతూండగా చూడలేదు. ఈనాడు మళ్ళీ అలగే ఆరోజుల్లోవలె ఏమీ కారణంలేకుండానే అతనికి తెలియకుండా ఏడవాలని చూస్తుండడంలో విశేష మేమిటో అర్థంగాలేదు.

మంచంమీద కూర్చున్నవాడు మళ్ళీ ఆమె ప్రక్కకు వచ్చి "ఏం...ఒంటు బాగోలేదా?" అన్నాడు. మాధవి మాట్లాడలేదు. కిందకు చూస్తూ, కాలిగోటితో గచ్చుమీద గీస్తూ బుర్ర నిలువునా తిప్పింది.

"మరేం. ఆ మాట చెప్పడంతోనే అదోలా అయిపోయావ్?"

"ఏంలేదు. ఊరికే. ఏదోజ్ఞాపకంవచ్చిందంటే...అయ్యో

మర్చిపోయాను. ఆకుల్లో సున్నం వ్రాయలేదండీ" అంటూ చేతిలో సున్నం వ్రాసిన ఆకు అతని కివ్వబోయింది.

"ఒద్దులే! నేను రాసుకున్నా" అన్నాడు నవ్వుతూ.

ఉయ్యాల్లో చంటాడు కదులుతూ ఉంటే వెళ్ళి తీసుకొచ్చి అతనికి చాటుగా పాలుపెడ్తూ "మీరు చాలా మంచివా రండీ" అంది. నిష్కల్మషంగా అన్న ఆమాటలు ఎందు కందో తెలీకపోయినా నిండుగా చిరునవ్వు నవ్వాడతను.

ప్రొద్దున్న లేచేటప్పటికి వెచ్చగా సూర్యకిరణాలు కిటికీ లోంచి మీాద వ్రాలుతున్నాయి. అంతకుముందే మాధవి ఓమారు వచ్చి లేపివెళ్ళిపోయింది. ఇక అప్పటికైనా లేవక పోతే బాగోదని బలవంతంగా లేచి ముఖం కడుక్కుందామని బావివైపు వెళ్ళాడు.

బావిదగ్గర మాలతి ఎదురై "ఏంబావా. కుంభకర్ణుడి నిద్ర చేశావు. నీకంటే బావేనయంసుమా. నాలుగింటికే లేచి అక్కకు పనిచెప్పాడు" అంది.

"మీా బాబు నాలుగాకులు ఎక్కువే చదువుకొంటాడు లేవే. ఈవాళ నాచేత పనిచేయించుకున్నవాడు మరో రెండు రోజులు పోతే నీకూ పనిచెప్తాడు" అంది మాధవి టూత్ పేస్టు బ్రష్ అవి బావిదగ్గరపెట్టి చెల్లెలన్న మాటకు జవాబుగా.

"ఎలా అయినా పేరు సార్థకంచేసుకొంటాడు. కృష్ణ మోహన్‌లో ఆ బాలకృష్ణుడి చిన్నెలన్నీ యిప్పటినుంచే ఉన్నాయిసుమా "అంది మాలతి మూతి మూడువంకర్లుత్రిప్పి.

మాధవి ముఖం ముడుచుకొంది. ఇంకా చెల్లెలితో

ఏమిటో అందామని, దాన్ని ఏడిపిద్దామని అనుకున్న మాధవి ఆమాట వినడంతోనే మరేమీ అనకుండా మెల్లగా వంటగది లోకి వెళ్ళిపోయింది. మాధవి అలా వెళ్ళిపోవడంలో కారణం ఏమిటో కాంతారావుకు, మాలతికి అర్థం కాలేదు. కొయ్యబారి పోయి కాస్సేపు అటే చూస్తూ ఉండిపోయారు. ఆమె వంట గదిలో పొయ్యిముందు కూర్చొని కాఫీ కాస్తున్నప్పుడు పైట చెంగుతో కళ్ళు వత్తుకోవడం ఒక్క కాంతారావే ముఖం కడుక్కొంటూ బావి ప్రక్కనే వంటగది కిటికీలోంచి చూశాడు.

స్నానం చేశాక గదిలో కూర్చొని పేపరు చదువుతూ ఉండగా మాధవి కాఫీ తెచ్చి యిచ్చింది. కప్పు అందుకొంటూ "కళ్ళు అలా ఉన్నాయేం?" అన్నాడు.

"ఎలా ఉన్నాయ్?" అంది అదోలా నవ్వుతూ. ఆనవ్వులో మార్దవం లేదు. అది అతడిని గిలిగింతలు పెట్టి మైమరపించి ఆమె నవ్వుతూ ఉంటే రెప్పార్పక యింకా చూడాలనిపించేలా చెయ్యలేదు. అందుకే ఆమె నవ్వినా చూసీ చూడనట్టు ఊరుకొన్నాడు. మాధవి అద్దంముందు నుంచొని కళ్ళు ఎర్రగా ఉండడం చూసి "ఏం లేదు. పొయ్యిదగ్గర కంట్లో ఏదో నలుసు పడిందంతే!" అంది. ఆమాట వినకుండానే మావ గారితో కలిసి బయటకు వెళ్ళిపోయాడు కాంతారావు.

మధ్యాహ్నం యింటికివచ్చాక భోజనందగ్గర "ఎక్కడకు వెళ్ళేరండీ?" అంది మాధవి.

"అబ్బాయిని తీసుకెళ్ళి అలా అవధానులగారింటికి వెళ్ళా,

నమ్మా. మన చంటిబాబు పేరు గురించి అబ్బాయి చెప్పాడు. అది బాగానే ఉందట. నక్షత్రం అదీ సరిపోయిందన్నారు.” అన్నాడు లక్ష్మీపతి అల్లుడికి బదులు తనే జవాబు చెప్పేస్తూ.

“అలాగా?” అంది మాధవి. ఆసమయంలో పప్పులో నెయ్యివేస్తున్న ఆమె చేతులు వణికి గాజులు గలగలమన్నాయి.

“అదేమిటి అంతనెయ్యి పోసేస్తున్నావ్!” అన్నాడు కాంతారావు ఆమెకేసి ఆశ్చర్యంగా చూస్తూ.

“అయ్యో మర్చిపోయాను. పోనీ ప్రక్కకు తీసెయ్యండి.” అంది మాధవి. కంగారుతో కూడుకున్న భయం ఆమెకు తెలీకుండానే పదాల్లో కనిపించింది.

అంతా భోజనాలు చేశాక ఏకాంతంగా మాధవినిచూసి అడిగింది మాలతి “ఏమే బావను చూసి లోకాన్ని మర్చిపోతున్నావేమిటి?”

“చాల్లేవే, నువ్వు మరీను.” చెల్లెలి వేళాకోళానికి నవ్వొస్తున్నా కావాలని కోపంఅభినయిస్తూఅంది.

“ఏమిటే మాలతీ నువ్వు మరీ చిన్నపిల్లవై పో తున్నావ్” అంటూ కోప్పడింది వంటింటిలోంచి మాణిక్యమ్మ.

“ఏంలేదమ్మా, అక్క యీ రెండురోజులబట్టి మరీ మతిమరుపు మనిషి అయిపోయిందంటున్నా నంతే!”

“నీకు ఎలాగూ కొమ్ములు తిరిగాయి. ఆగు, మరోసంవత్సరంపోతే చెవ్వులు మెలిపెట్టే మొగుడే దొరుకుతాడులే.”

“మహా బావ నీచెవ్వులు మెలిపెడ్తున్నట్టు. నెత్తికెక్కించు పూజించకపోతే సరి. ఇదిగో బాబు తయారయ్యాడుగా. నీనెత్తి కెక్కి కూర్చుంటాడు.”

"మా రత్న బాబు అలాంటివాడెప్పటికీ కాడు."

మాధవి మాటలు మాలతికి వింతగా అనిపించాయి.

"అదేమిటి రత్న బాబేమిటి?" అంది ఆశ్చర్యపోతూ.

"ఓ! — అదా బాబుపేరులే!" అనేసి వెళ్ళిపోయింది మాధవి.

కాంతారావు అంతా మంచంమీదనుండి విన్నాడు. మాధవి లోనికి రావడంతోనే "ఆపేరు ఎప్పుడు పెట్టావు మాధవీ?" అన్నాడు.

మాధవి మాట్లాడలేదు. ఉయ్యాల్లో బాబుకదులుతూ ఉంటే ఏదో జోలపాటపాడి ఊపుతూ, మధ్యలోపాటఆపి "ఏవండీ ఆపేరు బాగోలేదు?" అంది.

కాంతారావు తలూపాడు. "బాగానే ఉంది."

"మరి మనబాబుకి ఆపేరేపెడ్తే"

"బాగానేఉంటుంది. కాని ఎందుకూ, కృష్ణమోహన్ పేరు ఆలోచించాంగదూ."

అతనలా అంటుంటే ఆమెకళ్ళల్లో నీళ్ళు తిరగడం కనుపించింది. కాంతారావు దగ్గరగా వెళ్ళి "అదేమిటి మాధవీ, పేరు గురించి ఏడవాలా" అని బుగ్గలమీదకు జారేకన్నీటిని వ్రేలితో వత్తిగించాడు.

"చూడు. తాతగారిపేరు కృష్ణశాస్త్రిగారని నీకు తెలుసుగదా. వచ్చేటప్పుడు నాన్నగారు మరీమరీచెప్పారు. ఆపేరెట్టమని. వాళ్ళను కాదంటే ఎలా?" తల నిమురుతూ అన్నాడు. ఆమె అతని కౌగిట్లోంచి జారుకొని వెళ్ళిపోయింది.

మళ్ళీ చీకటిపడేవరకూ ఆమె అతనికి కనుపించనేలేదు. దీపం వెలిగించడానికని గదిలోకి వచ్చి వెళ్ళిపోయింది. అప్పు డామె ఎర్రగా చింతనిప్పుల్లా ఉన్న కళ్ళూ, చింపిరిగా చెదరి పోయిన జుట్టూ, నలిగి నల్లగా ఉన్న చీరతో అతనికి కను పించింది. కాంతారావు అనుకోకుండానే ఆమెను పిలిచాడు. మాధవి అతనివైపు చూడకుండానే వెళ్ళిపోయింది.

అలా మాధవి వెనక్కు తిరగకుండా అతను చెప్పేదేమిటో వినకుండా వెళ్ళిపోతుంటే కాంతారావు ఎంతటి సరళహృదయు డైనా బాహ్యంగా గాకపోయినా హృదయంలోనే కొంచెం బాధపడ్డాడు. కాస్సేపు ఆలోచించి ఆరాత్రికి భోజనం చెయ్య కూడదనుకున్నాడు.

మాలతి పిలవడానికొచ్చి కాంతారావు రానంటే వెళ్ళి పోయింది. మాధవి వచ్చి "భోజనం చెయ్యరా?" అంది ముభావంగా. కాంతారావు మాట్లాడలేదు. ఆమెకూ కాస్సేపు ఏమి మాట్లాడాలో తోచలేదు. మళ్ళీ "భోజనానికి రండీ" అంది. ఈసారి ఆమె మాటల్లో కోపం, కర్కశత్వం లేవు. ఆమెకు తెలీకుండానే అంత క్రిందకు దిగజారిపోయింది. కాంతారావు ఓమారు ఆమె ముఖంలోకి చూసి మళ్ళీ పుస్త కంలోకి దృష్టి మరల్చుకున్నాడు.

వర్షాకాలపు తొలిరోజుల్లో గాలితాకిడికై ఎదురు చూసే నీలాకాశపు తెల్లని మేఘాలు ఆమె కళ్ళల్లో నల్లగ్రుడ్డు చుట్టూరా ఆవరించాయి. చల్లగాలివీస్తే అవి మరికొద్దిసేపట్లో కరిగి నీరై బొట్లుబొట్లుగా కారిపోయే స్థితిలో ఉన్నాయి.

'పిచ్చిపిల్ల! మాట్లాడితే కళ్ళల్లో కన్నీరు నిలుస్తుంది. మరీ విడ్డూరంగా గోరంతల్ని కొండంతలుచేసి ఊరికే బాధ పడుతోంది' అనుకొంటూ పుస్తకం మడిచి ఆమె వెనకనే వెళ్ళాడు. భోజనం చేస్తూ ఆమెను నవ్విద్దామని "ఈసారి పుట్టిన వాళ్ళందరకూ నువ్వే పేరుపెట్టుకో. పేరుగురించి ఆలోచించడం, తీరా ఆలోచించాక ఒకరు మూతి ముడుచుకోవడం - యీ లేనిపోనిగొడవంతా నాకెందుకు? ఎంతమందికి ఎన్ని పేర్లు పెట్టాలనుకుంటావో ఇటుపై నువ్వే నిర్ణయించుకో" అన్నాడు.

బలవంతాన నవ్వాపుకొని "చాల్లెద్దురూ. ఎవరైనా వింటే నవ్విపోగలరు" అందామె.

బారసాలకాగానే మరుచటిరోజు ఉదయం కాంతారావు వెళ్ళిపోయాడు. బారసాలనాడల్లా మాధవి అదోలా ఉండడం చూచి కాంతారావు అంతవరకూ చెప్పకుండా దాచిన బంగారపు కొత్తగొలుసు - బాబుకని చేయించినది, మధ్య పలకల ఎర్రపొడి—చుట్టూరాగుండ్రని తెల్లపొడుల ఉంగరం, మరికొన్ని జుబ్బాయిలు ఆ మధ్యాహ్నం తీసి మాధవి చేతుల్లో పెట్టాడు.

బండలుపగిలే ఎండల్లో పైన నల్లమబ్బులుచేరి కొండమీద వర్షంకురిస్తే, క్రింద యిసుక తెప్పలతో మెరకపోసిన ఎండిన కొండకాలువ అకస్మాత్తుగా ఎవరికీ తెలీకుండా పొంగిపొరలినట్లుగా ఆమెలో అతనన్న మాటలకు ఆనందం పొంగిపొర్లలేదు. సంతోషం విరిసి విప్పారి మయూరనాట్యం చెయ్యలేదు. మా

మూలుగా వాటిని తీసుకొని భర్తకు అప్పటికి నవ్వుముఖం చూపి వెళ్ళిపోయింది.

ఆమె నిజంగా సంతోషించలేదని తర్వాత అతనికి అర్థమైంది. ‘బాబుపేరుగురించి ఆమెను కాదని తనుమొండి పట్టు పట్టుతూన్నట్టే అనిపించింది. అయినా పెద్దవాళ్ళమాట కొట్టి వేయడం బాగుండదు. మాధవికూడ మొండిపట్టే పడుతోంది. ఆపేరుగాకుండా ఎందుకు మరోపేరుపెట్టమంటుందో తనకు తెలీడంలేదు.’

మొత్తంమీద బాబుకు కృష్ణమోహన్ అన్న పేరు పెట్టడం విని అతను యింకేమీ మాట్లాడలేదు. మరుచటిరోజు ఉదయం వెళ్ళిపోతూ “అమ్మకు మనవడ్ని చూడాలనిఉంది. సాధ్యమైనంత వేగంగావచ్చేయ్.” అన్నాడు.

వెళ్ళిపోయాక నాలుగైదు ఉత్తరాలు వ్రాశాడు. అన్నింటిలోనూ ‘కృష్ణమోహన్ ఏంచేస్తున్నాడు, వాడికి నాముద్దులు’ అని బాబునుగురించిన విషయాలే. ఆమెవ్రాసిన జవాబుల్లోనూ బాబుఅల్లరి, ఆడేఆటలు, పాడేపాటలు-ఎదుటివారికి ఎందుకూ పనికిరాని ఉత్తచెత్త అనిపించేవి, తనకు చాలా అవసరం అని తోచినవి చాలా విషయాలు వ్రాస్తుండేది.

ఒక ఉత్తరంలో “నేను ఆదివారం మెయిలుకు వస్తున్నాను. స్టేషనుకురండి” అని వ్రాసింది. కాంతారావు గంట ముందుగా స్టేషనుకు వెళ్ళి బండివచ్చేవరకూ ఎదురుచూస్తూ నుంచున్నాడు. బండిదిగుతూ మాధవి కనుపించగానే వెళ్ళి “మనకృష్ణుడు బండిలో గొడవచెయ్య

లేదుకదా?" అన్నాడు. "ఉండే కొలదీ వట్టి పెంకివాడయి పోతున్నాడు. బండి ఎక్కింది లగాయితు ఒకటే ఏడుపు" అంది విసుగ్గా.

సామానుతో స్టేషను బయటికివచ్చి రిక్షాలో యింటికి వెళ్ళిపోయారు. మనవడిని చూసి మురిసిపోయింది సుబ్బలక్ష్మమ్మ.

"అచ్చంగా నీపోలికేనే అమ్మా" అంది కోడలితో. ఆనాయంకాలం "ఏంపిల్లా పేరుగురించి పట్టుబట్టావట" అంది.

"వట్టినేనండీ. పలకడానికి ఆపేరు బాగోలేదని మరోపేరేదైనా పెట్టమన్నాను. వారు అదే పెట్టాలంటే కాదంటానా." అంటూ కాంతారావు గదిలోంచి పిలుస్తుంటే లోనికి వెళ్ళింది.

"చూడు నీకృష్ణుడు ఏంచేశాడో. ఏడుస్తున్నాడుగదా అని ఎత్తుకొంటె షేంటు, చొక్కా రెండింటిని తడిపి ముద్దచేశాడు." అన్నాడు కాంతారావు. మాధవి పకాలుమని నవ్వి బాబును తీసుకొంటూఅంది "పేరుపెట్టినవారు ఆమాత్రం అల్లరి చేస్తే భరించలేరా" అని.

"బావుంది కృష్ణుడిపేరు పెట్టినంతమాత్రాన కొంటెవాడౌతాడనా నీఉద్దేశం. అయితే రత్నబాబని పేరెడ్తే రత్నాలు కురిపిస్తాడంటావ్?" అంటూ దగ్గరకొచ్చి బుగ్గమీద మెల్లిగాగిల్లి భోజనానికి వెళ్ళిపోయాడు. భోజనం చేసివచ్చి కూర్చున్న కాంతారావు అలికిడివిని కుర్రాడిని ఉయ్యాల్లో వేసి ఊపుతూన్న మాధవి "మీరు చాలా మంచివారండీ" అంది.

ఆమె అంతవరకూ అలా ఏమిటాలోచిస్తూఅందో అతనికి అర్థంకాలేదు. అవేమాటలు అంతకుముందొకసారి ఆమెనోటి

మీాదుగా వినిపించినట్టనిపించింది. అది ఎప్పుడు ఎక్కడ ఎంద కందో జ్ఞాపకం లేకపోయినా వట్టినే ఏ కారణం లేకుండా అ లేదని, ఆమాటలవెనుక భావగర్భితమైన విషయమేదో ఉం ఉంటుందని అతను ఊహించు కున్నాడు.

అది తెలుసుకోవాలని అతను ప్రయత్నించలేదు. ఆమె మనస్సు అతనికి తెలుసు. ఆమె ఏవిషయమూ చెప్పకుండా దాచదని అతనిఉద్దేశం.

ఒకసారి ఆమె కుర్రాడిని "రత్నబాబూ యిలారా"- అంది. అది కాంతారావు విన్నాడు. మళ్ళీ అతనిలో భావసం చలనం రేకెత్తింది. వాడినపువ్వులా మార్దవంలేని ఆమెనవ్వు, పుంతదాపున షికారీనిచూసి బెదరిన లేడిలా చెదరిన ఆమె చూపులు, మనసులోని విషయాన్ని దాచలేక వేరేరూపంలో బైటపెట్టే ఆమె దుర్బలత్వం అతని కళ్ళముందునిలచి ఏదో నిశ్చయాన్ని చేశాయి.

ఆరాత్రి ఆమె అతని దగ్గరకు వచ్చినప్పుడు "నాకు చెప్పవా?" అన్నాడు ఆమె చుబుకాన్ని, అధరాన్ని, వక్షాన్ని ముద్దెట్టు కొంటూ ఆనందమైన మరోలోకంలో ఆమెను తేలుస్తూ.

'ఏమిట' న్నట్టుగా అతని ముఖంలోకి ముఖంపెట్టి జ్యోతు ల్లాంటి కళ్ళార్పకుండా చూసింది ఆమె.

"నువ్వు బాబుని ఒక్కమాటూ పేరుపెట్టి పిలవ్వేం? అప్పు డప్పుడు క్రొత్త పేర్లు చేర్చుతూ ఉంటావెందుకు?" అన్నాడు.

అతని వెచ్చని బిగికౌగిట్లో ఉన్నా శిశిర ఋతువులో శీత గజగజలాడినట్టుగా వణికిపోయింది. అతను మళ్ళీ

ఆమె ముంగురుల్ని సవరిస్తూ "ఏదో విషయం నానుండి దాయా లనుకొంటున్నావు కదూ, నాకు చెప్పవా?" అన్నాడు అధి కారి అభిమానాన్ని అభ్యర్థించే జవాను అడిగినంత దీనంగా మెల్లగా.

ఆ సమయంలో ఆమె కళ్ళల్లో కన్నీరు నిలచి జారిపోవడం అతనికి కనుపించకపోయినా వేడినిట్టూర్పులు చుట్టూరా ఆవరించి ఏడుస్తోందనే విషయాన్ని తెలియజేసాయి.

కాంతారావు ఆ ప్రసంగాన్ని అంతటితో ఆపి ఆమెను నవ్వించాలని ఏమేమో అంటూ మరింత దగ్గరగా లాక్కుని వక్షానికి వక్షాన్ని, అధరానికి అధరాన్ని అదుముకున్నాడు.

రెండు నీటిచుక్కలు అతని చెంపలమీద పడ్డాయి. అతను తుడుచుకొని "ఇంకా ఏడుస్తున్నావా?" అన్నాడు. ఆమె మాట్లాడ లేదు. ఆ తర్వాత కొద్దిసేపటికి "మీరు నన్ను క్షమిస్తారా?" అంది. మళ్ళీ "ఊహు మీకు తెలీకూడదు. తెలిస్తే మీ మనస్సు వికలమైపోతుంది. మీరునన్ను క్షమిస్తా రని తెలుసు. అయినా మీకు చెప్పను." అంటూ లేచి కూర్చుంది. కాంతారావు లేవకుండానే "నా మనసు నీకు తెలీదా మాధవీ?" అన్నాడు.

మాధవి అతని వక్షంమీదకు వాలిపోయి వెక్కి వెక్కి ఏడ్చింది. కాంతారావుకు ఏంచెయ్యాలో తోచక ఆమె శిరో జాల్ని వ్రేళ్ళతో వెనక్కు దువ్వుతూ "పోనీ ఆ విషయం నాతో చెప్పవద్దులే" అన్నాడు.

ఏడ్చిఏడ్చి అతని గుండెలమీద నిద్రపోయింది. ఆమెను

ప్రక్కకు వత్తిగించి మరో మంచంమీదకు వెళ్ళిపోయాడు. ఎంతసేపటికీ నిద్రపట్టలేదు. లేచివెళ్ళి లైటువేశాడు. నుదుటి మీద చెదిరిపోయిన ఎర్రని సింధూర తిలకం ముందుకు వ్రాలిన శిరోజాలతో కలిసి గుండ్రని ముఖంలో వింతగా శోభించింది. ముఖంలో స్వేదబిందువులు దీపపు వెలుతుర్లో రాలిపోయిన బంగారు యిసుకలా జిగేలుమన్నాయి. ఆమె మంచంవరకూ వచ్చి చూస్తూ నుంచున్నాడు. ప్రశాంతమైన ఆమెముఖంలో అశాంతి చెలరేగిన చ్ఛాయలు అక్కడక్కడ కనుపించాయి.

"ఉహూ. నేను మీకు చెప్పను... చెప్పను." అంటోంది. నిద్రలోనే.

"పిచ్చిపిల్ల! నిద్రలోకూడా యీ కలవరంపేసా" అనుకొంటూ వెళ్ళి పడుకొన్నాడు.

పొద్దున్న లేచేటప్పటికి ఎదురుగుండా మాధవి నుంచొని "ఇంకా నిద్రేమిటండీ. అత్తయ్య ఊరికే కంగారుపడుతోంది అవతల కారుకి టైం అయిపోతుందని. వెళ్ళి కారెక్కించి రండీ" అని అంటున్న మాటలు వినిపించాయి. అప్పుడు జ్ఞాపకంవచ్చింది అమ్మ చెల్లెలుదగ్గరకు వెళుతున్నట్టు, తను వెళ్ళి కారు ఎక్కించాల్సి ఉన్నట్టు.

సుబ్బలక్ష్మమ్మను కారుకు పంపించి పదింటికల్లా యింటిని చేరుకున్న కాంతారావు ఆరోజు గవర్నమెంటు సెలవవడం వల్ల యింటిదగ్గరే ఏవో పుస్తకాలు చదువుతూ ఉండిపోయాడు. మాటిమాటికి మాధవి అతను చదువుకొంటున్న గది

లోకి ఏదో చెప్పాలని వచ్చి చెప్పకుండానే వెళ్ళిపోతుండేది. అతనిదగ్గరకంటూ వచ్చి ప్రక్కనే కూర్చొని ఏదో జ్ఞాపకం రాగా అంతలోనే లేచిపోయేది. భూగర్భంలో శిలలు కరిగి లావాలుగా బైటపడడానికై సుస్థిరమైన కొండల్ని కదిపి భూకంపాల్ని రేకెత్తించినట్టు ఆమెమనసులో ఏదో విషయం బైటపడాలని నిశ్చలమైన హృదయంలో పెద్ద సంచలనాన్ని తీసుకొచ్చింది. ఆ తాకిడికి ఆమె తట్టుకోలేక ఒక్కొక్కప్పుడు అతని ముందు అంతా వెళ్ళగ్రక్కకుండా మనుకొనేది. కాని అది బైటపడినతర్వాత సంభవించే సంఘటనల్ని తలంచు కొంటూ గజగజలాడిపోయేది.

చివరకు ధైర్యంచేసి అతనిముందుకొచ్చి "ఒక విషయం చెప్పమంటారా?" అంది. అతను ఊ అనలేదు. కాని చెప్ప మన్నట్టుగా ఆమెవైపు చూశాడు.

ఆమె కూడగట్టుకున్న అంతధైర్యమూ అతని చూపుతో అంతరించిపోయింది. చీకటిలో వెళ్తున్నవాడు 'పామును చూసి తాడనుకొని ప్రక్కనుంచిపోయినా అది ఏమీ చెయ్యదని' నిర్ణయించుకొని తాడునుచూసి పామని పరుగెత్తి పారి పోయినట్టుందామె స్థితి. ఏదో చెప్పాలని వచ్చిన ఆమె అసలు విషయం మాని "ఏంలేదు" అని వెళ్ళిపోయింది.

పుస్తకం మడిచి కాంతారావు ఆమె వున్న గదిలోకి వెళ్ళాడు. ఏమిటో ఆలోచిస్తూ ఉంది మాధవి. అతన్నిచూసి లేచి నుంచుంది.

"ఏదో చెప్తానని యిలా వచ్చేశావేం?" అన్నాడతను.

"మీరు కోప్పడరు కదా?" జాలిగా అతని కళ్ళల్లోకి చూస్తూ అంది.

"పిచ్చిదానా. ఎప్పుడయినా కోప్పడ్డానా?"

లేదన్నట్టు తల త్రిప్పింది. "మరి క్షమిస్తారు కదూ?" అంది మళ్ళీ అతి దీనంగా. జవాబుగా అతను ఆమెప్రక్కనే మంచంమీద ఆమెతోబాటు కూర్చొని ఆమెచేతుల్లోకి తన చేతిని చాచాడు.

ఆమెకు ఏంచెప్పాలో తోచలేదు. చాలానిమిషాలు మౌనంగా గడిచిపోయాయి. ఆమె 'ఎలా చెప్పనూ' అని ఆలోచిస్తోంది. అతను 'ఏమిచెప్తుందీ' అని ఎదురుచూస్తూ ఉన్నాడు.

"చిన్నప్పుడు చదువుకొనే రోజుల్లో నాకూ కృష్ణమోహన్‌కూ పరిచయం ఉండేది." అకస్మాత్తుగా ఆమె ఆరంభించింది. షాక్ తిన్నవాడులాఅదిరి మళ్ళీయథాస్థితికి వచ్చాడు. కాంతారావు. మాధవి భయపడి సందేహంగా అతనివైపు చూసింది. "ఫరవాలేదుచెప్పు" అన్నాడు అతను చాలా స్థిరచిత్తంతో.

"అప్పుడు థిప్తుఫారంగాబోలు చదువుతున్నాను. ఎదురింటిలో ఒకభాగం అద్దెకుతీసుకొని పెద్దాళ్ళతోఉంటూ కాలేజీలో.యింటరు చదువుతూండేవాడాఅబ్బాయి. అతనికి పాటలు పాడడంబాగావచ్చు. ఎందుకో అతను పాడుతూఉంటే నాకు వినాలనిపించేది. ఆసమయంలో ఏదోమిషమీద ఎదురింటికి వెళ్ళేదాన్ని. తలుపుసందుల్లోంచీ కిటికీసందుల్లోంచీ ఆపాటలు వింటుండేదాన్ని. ఒకసారి అతన్నిచూశాక అభిమానంపుట్టుకొచ్చింది. ఇంటివాళ్ళచేత కథలపుస్తకాలు ఉంటేయిమ్మని కబురంపించాడు. నాన్నగారి అలమారాలోఉన్న బండెడు పుస్తకాలూ అలాచలనంలేక పడుండడం ఎందుకని కొన్ని

తీసిచ్చాను. వాటిని పంపించి మరికొన్ని యివ్వమన్నాడు. మళ్ళీ యిచ్చాను. ఇలానే జరిగేది.

ఒకసారి స్కూలునుండి వస్తూవుంటే అతనుఎదురై నన్ను ప్రేమిస్తున్నట్టూ, ఆవిషయం చెప్పాలని ఎంతోకాలంనుంచి ఎదురు చూస్తున్నట్టూ చెప్పాడు. ఇద్దరం మాట్లాడుకుంటూ యింటికి వచ్చేశాం. మరో రెండుమూడుసార్లు అలానే కలిసాడు. మనసుల్ని విప్పి చెప్పుకొని ప్రేమతో, చిలిపికళ్ళతో కులాసాగా కలిసి మాట్లాడుకొనేవాళ్ళం. కాలం సర్దాగా చూస్తుండగనే గడిచిపోయేది. ప్రేమల్లో యింతమహత్తరశక్తి ఉందిగాబోలనుకున్నాను. ఆసంగతి ఎవరో నాన్నగారితో చెప్పారు గాబోలు ఒకరోజుసాయంకాలం వాళ్ళింటివాళ్ళతో పెద్ద పోట్లాట జరిగింది.

అప్పటినుండీ ఎదురింటికి వెళ్ళేదాన్నికాను. ఆతర్వాత ఒకసారి దారిలోకలిసి ఏవేవో చెప్పాడు. భయంతో మారు మాట్లాడకుండా యింటికివెళ్ళిపోయాను. పాపం నాగురించి రోజూ ఎదురుచూస్తూ కిటికీముందు కూర్చొనేవాడు. ఆసంవత్సరం అతడి పరీక్ష పోయింది. నాకు యిక చదవాలని పించక ఆసంవత్సరంతో స్కూలుమానేశాను. వాళ్ళు ఆ తర్వాత మరో ఊరు వెళ్ళిపోయారు.

ఒకరోజు అకస్మాత్తుగా కృష్ణమోహన్ వచ్చి నేనుయింట్లో ఉన్నానేమోనని అడిగాడట. నాన్నగారు మొఖంవాచేటట్లు చీవాట్లువేసిపొమ్మని గెంటేశారట. ఆతర్వాతఒకసంవత్సరానికి మతిభ్రమణంతో ఊళ్ళల్లాతిరుగుతున్నాడని తెలుసుకొన్నాను. ప్రత్యక్షంగా ఒకరోజుచూశాను. పీడమొఖం, మాసిపోయిన గెడ్డం, దుమ్ముధూళితో చినిగిపోయిన బట్టలు ఆకారంపోయి

వికారంగా కనుపించాడు." అంటూ మాధవి రెండుచేతుల్తోనూ ముఖం కప్పుకొని. అతని ఒడిలోకి వాలిపోయింది. కాంతారావు చాలాసేపటివరకూ ఆమెను కదల్పలేదు. చలనంలేని శిలాప్రతిమలా కూర్చొని బయటికిటికీలోంచి చూస్తున్నాడు. మబ్బు విడచిన సూర్యునిఎండ తెల్లగా గదిలోపడుతోంది.

మాధవి అతని ఒడిలోంచి లేచి భయంగా అతని వైపు చూసింది. కాంతారావు చిరునవ్వు నవ్వాడు. "ఇందుకేనా యింతకాలంనుంచీ బాధపడుతూన్నావ్ ! భలేపిల్లవే ! చిన్నతనంలో జ్ఞానంలేని యీడులో ఏదో చేసి పెద్దయ్యాకకూడా బాధపడతావెందుకు ? ఒకనాడు తెలీకచేసినపని జీవితాంతం విచారించడానికికారణం కాకూడదు. నడిచిపోతున్నప్పుడు కాలిక్రింద చీమలు నలిగి చస్తున్నాయని బాధపడవు. అంతే! నీకు తెలీకుండా జరిగిన దానికి నువ్వు బాధ్యురాలవు గావు. ఇంత చిన్న విషయానికే నువ్వు లోలోపలే కుమిలిపోవడం నాకు ఆశ్చర్యంగాఉంది. గోరంతల్ని కొండంతలుగా ఊహించుకొని నీలో నీవే కుమిలిపోతుంటే అర్ధంగాక మనిద్దరిమధ్యా మనస్పర్ధల కార్చిచ్చు ఎలా రగుల్కొందో చూశావా ? కార్చిచ్చు అంటుకొంటే చెట్టొకటేకాదు అడవంతా నాశనమవుతుంది. ప్రారంభంలోనే దాన్ని అణగార్చివేయాలి. ఇంకా భయపడతావేమిటె ! యిలా దగ్గరకు వచ్చి అవతల కిటికీలోంచి చూడు" అంటూ దగ్గరగా ఆమెను తీసుకొని ఆకులమధ్య ఆడుకొంటున్న పక్షుల్ని చూపించి పరధ్యానంగా ఆమె చూస్తుంటే చటుక్కున ఆమె చుబుకంమీద ముద్దెట్టుకొన్నాడు.